అభయం!

☛ శ్రీసత్యసాయి జిల్లా హిందూపురానికి చెందిన భాగ్యలక్ష్మి గర్భం దాల్చింది. అయితే ఆమెకు గుండెలో సమస్యలు కూడా ఉండటంతో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు కాన్పు సమయంలో కష్టమవుతుందని భావించి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు గత నెల 27న రెఫర్ చేశారు. ఆమెకు ఈ నెల 2వ తేదీన ఇక్కడి వైద్యులు సిజేరియన్ ద్వారా సుఖ ప్రసవం చేశారు. తల్లీబిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారు.

☛ కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం కులుమాల గ్రామానికి చెందిన ముంతాజ్‌కు లంగ్ ఎటాక్(ఊపిరితిత్తుల్లో ఆరోగ్య సమస్య) వచ్చింది. దీంతో పాటు బీపీ, ఆయాసం పెరగడంతో ప్రసవం కోసం ఎమ్మిగనూరు వైద్యులు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వారం రోజుల క్రితం పంపించారు. ఆమెకు ఐదు రోజుల క్రితం వైద్యులు సుఖ ప్రసవమయ్యేలా చేశారు. ఊపిరితిత్తుల్లో సమస్య ఉండటంతో ఐసీయూలో ఉంచి కోలుకునేలా చేశారు. ప్రస్తుతం ఆమె పూర్తిగా కోలుకుంది.

హైరిస్క్ గర్భిణులకు పెద్దాసుపత్రి రక్ష

- ఇతర ఆసుపత్రుల్లో సీరియస్ అయిన కేసులూ ఇక్కడికే...
- సుఖప్రసవమయ్యేలా వైద్యుల చర్యలు
- రోజూ 30 దాకా ప్రసవాలు
- అందులో అధిక శాతం హైరిస్క్ కేసులు



ప్రసూతి విభాగంలో చికిత్స పొందుతున్న బాలింతలు

కర్నూలు(హాస్పిటల్): తల్లీబిడ్డ ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోంది. దీంతో క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది గర్భిణుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. హైరిస్క్ ఉన్న గర్భిణిలను ముందుగానే ప్రత్యేకంగా వైద్యపరీక్షలు నిర్వహించి పర్యవేక్షిస్తున్నారు. ప్రసవానికి రెండు వారాల ముందుగానే అన్ని రకాల వసతులు ఉన్న ప్రభుత్వాసుపత్రికి తరలించి సుఖప్రసవమయ్యేలా చేస్తున్నారు. మరోవైపు ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ చేతులెత్తేసిన ప్రసవం కేసులు పెద్దాసుపత్రికి వస్తున్నాయి.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 87 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 18 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 40 అర్బన్‌హెల్త్ సెంటర్లు, మూడు ఏరియా ఆసుపత్రులు, రెండు బోధనాసుపత్రులు ఉన్నాయి. వీటితో పాటు 200లకు పైగా ప్రైవేటు ఆసుపత్రులు ఏర్పాటయ్యాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో దాదాపుగా అన్నింటిలో, ప్రైవేటులో 90కి పైగా ఆసుపత్రుల్లో ప్రసవాలు చేస్తున్నారు. ఆయా ఆసుపత్రుల్లో ఎక్కడ గర్భిణికి హైరిస్క్ ఉందని తెలిసినా వెంటనే వారు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రెఫర్ చేస్తారు. కేవలం ఉమ్మడి జిల్లానే గాకుండా ఉమ్మడి అనంతపురం, వైఎస్ఆర్ జిల్లా, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి సైతం హైరిస్క్ గర్భిణులను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తీసుకొచ్చి ప్రసవాలు చేయిస్తున్నారు. దీంతో ఆసుపత్రిలోని ప్రసూతి విభాగం నిత్యం గర్భిణులతో కిటకిటలాడుతుంటోంది.

ప్రసూతి విభాగంలో గత ఐదేళ్ల నుంచి ఓపీ, ప్రసవాల వివరాలు ఇలా..

సంవత్సరం	ఓపీ	ప్రసవాల సంఖ్య
2019	56,858	10,542
2020	25,586	8,372
2021	38,339	9,309
2022	29,661	9,890
2023	30,100	9,175

ఏటా 10వేల ప్రసవాలకు పైగానే...

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రతి రోజూ 30 నుంచి 35 ప్రసవాలు జరుగుతున్నాయి. ఈ లెక్కన ప్రతి నెలా సగటున 800, ఏటా 10వేల వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యధిక శాతం ఇక్కడే ప్రసవాలు జరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. పెద్దాసుపత్రిలో ప్రత్యేకంగా మాతాశిశు సంక్షేమ భవనం ఉండటమే గాక ఇటీవల ప్రత్యేకంగా ఐసీయునూ ఏర్పాటు చేశారు. మెడికల్ సమస్యలుంటే వెంటనే ఏఎంసీలో ఉంచి వైద్యం అందిస్తుంటారు.

హైరిస్క్ ఉన్నా సేఫ్ డెలివరీ

ప్రసూతి విభాగానికి ప్రతిరోజూ వచ్చే ప్రసవాల్లో 5 నుంచి 7 వరకు హైరిస్క్ ప్రసవాలే ఉంటాయి. ఇవి ఆయా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల నుంచి రెఫర్ చేయబడ్డవి. ఇతర జిల్లాల్లోని బోధనాసుపత్రుల నుంచి సైతం ఇక్కడికి రెఫరల్‌గా చికిత్స కోసం వస్తున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఎక్కడ నుంచి వచ్చినా, ఏ ఆసుపత్రి వైద్యులు రెఫర్ చేసినా మాకు కూడా కష్టమే అన్న మాటే ఇక్కడ వినపడదు. హైరిస్క్‌లో ఎక్కువగా బీపీ, షుగర్, ఫిట్స్, తీవ్ర రక్తహీనత, పసిరికలు, సెప్సిస్, గుండె, కిడ్నీ జబ్బులు, థైరాయిడ్ సమస్యలున్న వాటిని హైరిస్క్ కేసులంటారు. హైరిస్క్ పేరుతో వచ్చిన గర్భిణులకు దాదాపుగా సేఫ్ డెలివరీ చేసి పంపించడమే ఇక్కడి వైద్య సిబ్బంది లక్ష్యంగా పనిచేస్తున్నారు. ఈ విషయంలో వారు సఫలీకృతమవుతున్నారు కూడా.

పూర్తిస్థాయిలో వైద్యుల సంఖ్య

ఆసుపత్రిలోని ప్రసూతి విభాగంలో ఏడు యూనిట్లు ఉన్నాయి. ఇందులో ప్రస్తుతం ఐదుగురు ప్రొఫెసర్లు, ఐదుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు, 18 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఆరుగురు సీనియర్ రెసిడెంట్లు పనిచేస్తున్నారు. వీరితో పాటు మొత్తం 18 పీజీ సీట్లు ఉండటంతో ప్రస్తుతం 42 మంది పీజీలు చదువుతూ వైద్యం చేస్తున్నారు. ఇందులో ఇటీవల ఆరు పీజీ సీట్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. వైద్యుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో హైరిస్క్ కేసులు వచ్చినా ఇబ్బంది లేకుండా ఉంటోంది.

అధిక శాతం హైరిస్క్ కేసులే వస్తున్నాయి



ఉమ్మడి జిల్లా నుంచే గాక ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి సైతం మా వద్దకు ప్రతిరోజూ 10 వరకు హైరిస్క్ కేసులు వస్తుంటాయి. ఇందులో అధికంగా తీవ్ర రక్తహీనత, బీపీ పెరగడం, తగ్గడం, ఇతర అనారోగ్య సమస్యలతో హైరిస్క్ ప్రెగ్నెన్సీతో వస్తున్నారు. వారికి అవసరమైన అన్ని రకాల వైద్యసేవలు అందేలా చేసి సుఖప్రసవమయ్యేలా చూస్తున్నాము. ఈ మేరకు మా విభాగం వైద్యులు, సిబ్బంది అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఎంతో హైరిస్క్‌తో వచ్చిన గర్భిణి సుఖప్రసవం అయి కోలుకుని ఇంటికి వెళ్తుంటే మాకు కలిగే సంతృప్తి చెప్పలేనిదిగా ఉంటుంది.

–డాక్టర్ ఎ.శ్రీలక్ష్మి, గైనకాలజి హెచ్ఓడీ, జీజీహెచ్, కర్నూలు

క్లుప్తంగా

పీజీ సెమిస్టర్ పరీక్షలకు 90 శాతం హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న పోస్ట్ గ్రాడ్యుయేషన్ మొదటి సెమిస్టర్ పరీక్షలకు సోమవారం 90 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆర్‌యూతో పాటు నందికొట్కూరు, నంద్యాల, ఆళ్లగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ఆదోని జ్యోతిర్మయి డిగ్రీ కళాశాలల్లో పరీక్షలు జరిగాయి. మొత్తం 558 మంది విద్యార్థులకు 503 మంది హాజరయ్యారని, వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వెంకటేశ్వర్లు తెలిపారు.

వీహెచ్‌పీ రాష్ట్ర సహ సేవా ప్రముఖ్‌గా గురుమూర్తి



కర్నూలు కల్చరల్: విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) రాష్ట్ర సహ ప్రముఖ్‌గా పి.పి.గురుమూర్తిని నియమించినట్లు వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి కాకర్ల రాముడు తెలిపారు. తిరుపతిలో మూడు రోజుల పాటు జరిగిన వీహెచ్‌పీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలో వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నంది రెడ్డి సాయిరెడ్డి ప్రకటించారని తెలిపారు. గురుమూర్తి ప్రధానోపాధ్యాయుడిగా పదవీ విరమణ పొందిన తరువాత కర్నూలు నగర శివారులోని విజ్ఞాన పీఠం ఎయిడెడ్ పాఠశాలకు, అరక్షిత శిశు మందిరానికి కరస్పాండెంట్‌గా పది సంవత్సరాల నుంచి సేవలు అందిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వీహెచ్‌పీ సేవా ప్రముఖ్‌గా ఐదు సంవత్సరాల నుంచి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కాగా వీహెచ్‌పీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సేవా కార్యక్రమాలను విస్తరిస్తామని గురుమూర్తి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించండి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్) : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాల ని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కార్మిక, కర్షక భవన్‌లో న్యూసిటీ, దాని అనుబంధ సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవకాశవాద టీడీపీ కూటమిని ఓడించాలని ప్రజలను కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులు, రైతులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. లేబర్ కోడ్లను తగ్గించడంతో కార్మికులు బానిసలుగా మారిపోయారన్నారు. రైతన్నకు కనీస మద్దతు ధర కోసం పోరాటం చేస్తున్నా స్పందించకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ అంజి బాబు, పీఎస్ రాధాకృష్ణ, టి.రాముడు పాల్గొన్నారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న ఉద్యోగులందరూ సమయపాలన పాటించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. సోమవారం ఆయన తన చాంబర్‌లో ప్రోగ్రామ్ అధికారులు, కార్యాలయ సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. అన్ని సెక్షన్లలో పనిచేసేవారందరూ తమ విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఎలాంటి ఫైల్స్ పెండింగ్ లేకుండా చూసుకోవాలని, వర్క్ పరంగా, ఎఫ్ఆర్ఎస్ హాజరు నిర్ణీత సమయంలోనే వేయాలని, ఫిజికల్ అటెండెన్స్ కూడా తప్పకుండా అందరూ పాటించాలని చెప్పారు. ఉన్నత ప్రమాణాలు కలిగిన ఆరోగ్యసేవలను పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందించాలని సూచించారు. సమావేశంలో ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్ శైలేష్‌కుమార్, ఎస్ఓ హేమసుందరం, డెమో ప్రమీలమ్మ, డీపీఎంఓ ఇందిర, ఆఫీస్ సూపరింటెండెంట్ పత్తికొండ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అధికారం కోసం మోదీ అబద్ధాలు



సమావేశంలో మాట్లాడుతున్న జి.ఈశ్వరయ్య

కర్నూలు(సెంట్రల్): దేశ సంపదను అదానీ,అంబానీలకు దోచి పెడుతున్న ప్రధాని మోదీ మళ్లీ అధికారం కోసం అబద్ధాలు ఆడుతున్నారని ఏఐవైఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి జి.ఈశ్వరయ్య విమర్శించారు. సోమవారం సీఆర్ భవన్‌లో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు అధ్యక్షతన వాయిస్ ఆఫ్ యంగ్ ఇండియా పేరుతో ఉద్యోగ, ఉపాధి కల్పనలో పాలకుల విధానాలు,యువత కర్తవ్యం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పదేళ్ల క్రితం అధికారంలోకి రాకమునుపు ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి మోసం చేశారన్నారు. అయితే ఇప్పుడు మళ్లీ అవే అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చి మరోసారి యువతను మోసం చేసేందుకు పన్నాగం పన్నుతున్నారని ఆరోపించారు. ఈసారి బీజేపీ సర్కారుకు ఓటుతో బుద్ధి చెప్పాలని యువతకు పిలుపునిచ్చారు. లేకపోతే దేశ సంపద పరుల పాలవుతుందని, నిరుద్యోగం పెరిగిపోతుందన్నారు. బీజేపీని ఓడిస్తేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్.లెనిన్‌బాబు పాల్గొన్నారు.

ప్రైవేటు అధ్యాపకులను వెంటనే రిలీవ్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇంటర్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి గురవయ్యశెట్టి

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ పరీక్షల మూల్యాంకనానికి అసిస్టెంట్ ఎగ్జామినర్లుగా ఆర్డరు పొందిన ప్రతి అధ్యాపకుడు విధులకు హాజరుకావాలని, ప్రైవేటు కాలేజీల్లో పని చేస్తున్న అధ్యాపకులను ఆయా కాలేజీలు వెంటనే రిలీవ్ చేయాలని ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి గురవయ్య శెట్టి సూచించారు. సోమవారం మూల్యాంకనం మొదటి స్పెల్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ముందుగా స్పాట్‌లో పాల్గొనే అధ్యాపకులతో జిల్లా పరీక్షల కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మూల్యాంకనం ప్రతి రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు. ప్రతి అసిస్టెంట్ ఎగ్జామినర్ నిర్దేశించిన సమయానికి వచ్చి, క్యాంపు సమయం వరకు ఉండాలన్నారు. ఎక్కడా చిన్న పొరపాటుకు తావు ఇవ్వకుండా పేపర్లను మూల్యాంకనం చేయాలన్నారు. ఓఎంఆర్ షీటును ఖచ్చితంగా పోస్ట్ చేసి బబూల్ చేయాలన్నారు. ఆర్డరు పొందిన ప్రతి ఒక్క అధ్యాపకుడు విధులకు హాజరుకావాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్–1 కె.జమీర్ పాష, క్యాంపు ఆఫీసర్–2 సుంకన్న, సీసీఓ–1 జీ.ఎస్ సురేష్ చంద్ర, సీసీఓ–2 కె.నాగభూషణ్ రెడ్డి, పి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గోదా గోకులం వార్షిక వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న జీయర్‌స్వాములు, రుత్వికులు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని గోదా గోకులంలో వెలసిన శ్రీ గోదా దేవి సమేత రంగనాథ స్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. ఉదయం ప్రాతఃఆరాధన, అర్చన, సేవా కాలం, తిరుప్పావై, శాత్తుమొర, తీర్థప్రసాద వినియోగం, శ్రీపుష్పయాగ ద్వాదశారాధన, దేవతోద్వాసనమ్, నివేదిక, సాయంత్రం అష్టోత్తర శత కలశ ఉత్సవాస్త స్నపనం తదితర నిర్వహించారు. కార్యక్రమంలో ప్రయాగ్ రాజ్ రాఘవ ప్రసన్న జీయర్ స్వామి, పరమాత్మ నందగిరి స్వామి, గోదాగోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజు గుప్త, ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, సభ్యులు పాలాది సుబ్రహ్మణ్యం, బాల సుధాకర్,భూమా కృష్ణమోహన్, వేముల జనార్దన్, తల్లం సురేష్, తలుపుల శ్రీనాథ్, వెంకట సుబ్రహ్మణ్యంతో పాటు గోదాగోకులం పరివారం పాల్గొన్నారు.

ఆర్‌డీఓ ఆఫీసులో కోడుమూరు కమాండ్ కంట్రోల్ రూం

కర్నూలు(సెంట్రల్): కోడుమూరు నియోజకవర్గానికి సంబంధించి కర్నూలు ఆర్‌డీఓ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆ నియోజకవర్గ ఆర్ఓ/ఆర్‌డీఓ ఎం.శేషిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదుల, సలహాలు, ఇతర వివరాల కోసం సంప్రదించాలని సూచించారు. నేరుగా వచ్చి ఫిర్యాదు చేయలేకపోతే 18004257559, 08518–294467 నంబర్లకు ఫోన్ చేసి కూడా తెలియజేయవచ్చునని ఆయన ప్రజలకు సూచించారు

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



కల్లూరు అర్బన్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: జగనన్న సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి మీ విలువైన ఓటు వేసి ఆశీర్వదించాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. సోమవారం కల్లూరు అర్బన్ 37, 41వ వార్డుల్లో ఎమ్మెల్యే కాటసాని దంపతులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పార్టీలు, వర్గాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన జగనన్నను మరోమారు ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. టీడీపీ హయాంలో సిఫారసు ఉన్న వారికి మాత్రమే సంక్షేమ పథకాలు అందించారని, జన్మభూమి కమిటీల పేరుతో పేదలను ఇబ్బందులకు గురి చేశారన్నారు. అధికారం కోసం మళ్లీ చంద్రబాబు పొత్తులతో వస్తున్నారని ఓటుతో ఆయనకు బుద్ధి చెప్పాలన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేయ్యండి

నియోజకవర్గంలోని ప్రజలకు మరింత మేలు జరగాలంటే ఎన్నికల్లో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డిని గెలిపించుకోవాలని ఎమ్మెల్యే సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ అన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఆమె సోమవారం వీకర్‌సెక్షన్ కాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. మహిళలు, అవ్వతాతలను ఆప్యాయంగా పలకరిస్తూ వైఎస్సార్‌సీపీ సర్కారుకు అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ పరిధిలోని కార్పొరేటర్లు, స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



వీకర్‌సెక్షన్ కాలనీలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని సతీమణి ఉమామహేశ్వరమ్మ

స్కాలర్‌షిప్ టెస్ట్‌లో ఉత్తీర్ణత

కర్నూలు (న్యూటౌన్): తపాలాశాఖ 2023–2024 సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన దీన్‌దయాళ్ స్పర్శ్ యోజన (డీడీఎస్‌వై) స్కాలర్‌షిప్ పరీక్షలో పలువురు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. సోమవారం వారిని పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఫజుల్ రహమాన్ ప్రత్యేకంగా అభినందించారు. ఉత్తీర్ణత సాధించిన వారిలో సెయింట్ జోసఫ్, మాంటిస్సోరి, ఇండస్ స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులు ఉన్నారని, వారికి ఒక్కొక్కరికి రూ. 6 వేలు స్కాలర్‌షిప్ ఇవ్వనున్నట్లు తెలిపారు.

సీఏ కోర్సుకు డిమాండ్

కర్నూలు సిటీ: దేశ వ్యాప్తంగా సీఏ కోర్సుకు భారీ డిమాండ్ పెరిగిందని, గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది మే నెలలో సీఏ పరీక్షలకు పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరుకానున్నట్లు మాస్టర్ మైండ్స్ కాలేజీ అడ్మిన్ ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని స్వయంగా సెంట్రల్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఇనిస్టిట్యూట్ సభ్యులు రోహిత్ అగర్వాల్ ప్రకటించారన్నారు. పదో తరగతి పూర్తి అయిన తరువాత ఇంటర్‌లో ఎంఈసీ గ్రూప్ చదివిన వారికి సీఏ కోర్సు అనువైనదిగా ఉంటుందన్నారు.

ఆటో చోరీ

కర్నూలు : బంగారుపేటలో ఇంటి ముందు పార్కు చేసి ఉంచిన ఆటో చోరీకి గురయ్యింది. మునగాలపాడు గ్రామానికి చెందిన నీలి షికారి వసంతకుమార్ ఈనెల 14వ తేదీన బంగారుపేటలో ఉన్న బంధువుల ఇంటికి ఆటోతో వచ్చాడు. ఇంటి ముందు పార్కు చేసి బంధువులతో మాట్లాడి బయటకు వచ్చేసరికి ఆటో కనిపించలేదు. కర్నూలు నగరంతో పాటు చుట్టుముట్టు గ్రామాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

‘మీరే వైద్యం చేసుకోవచ్చు’పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్ : సామాన్యులకు వైద్యం అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి అన్నారు. సోమవారం రాత్రి స్థానిక టీజీవి కళాక్షేత్రంలో ‘మీరే వైద్యం చేసుకోవచ్చు’ పుస్తక ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమానికి రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ నాగరాజు అధ్యక్షత వహించగా టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ కరోనా తీవ్ర నష్టాన్ని కలిగించిందన్నారు. అనంతరం అనేక వ్యాధులు వస్తున్నాయని, చీటికిమాటికీ వైద్యుల దగ్గరికి పరిగెత్తకుండా ఇంట్లోనే వైద్యం చేసుకోవడానికి వీలుగా పుస్తకం రచించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు మహమ్మద్ మియా, స్వరాజ్యలక్ష్మి, శ్రీరాములు, జంధ్యాల రఘుబాబు తదితరులు మాట్లాడారు.

ఎన్నికలకు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాబురావు

కర్నూలు(సెంట్రల్) : ఎన్నికల సమరానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు పిలుపునిచ్చారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో త్వరలోనే ఎమ్మెల్యే, ఎంపీగా పోటీ చేసే అభ్యర్థులు జాబితాను అధిష్టానం ప్రకటిస్తుందన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఇంటింటా ప్రచారం నిర్వహించి గెలుపుకోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప, నాయకులు ఉండవల్లి వెంకటన్న, రాధాకృష్ణ, చిప్పగిరి లక్ష్మీనారాయణ, జాన్ విల్సన్, సత్యనారాయణ గుప్తా పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు (హాస్పిటల్): వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం (ఐఎన్‌టీయూసీ) నాయకులు కోరారు. నూతనంగా డీఎంహెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను యూనియన్ నాయకులు కలిసి సోమవారం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఎదు ర్కొంటున్న సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం.సి నరసింహులు, జిల్లా కార్యదర్శి ఎస్.డి.సంపత్ కుమార్, కోశాధికారి ఎస్.సాయిరాం, నాయకులు బాలకృష్ణయ్య, చంద్రశేఖర్, హరికృష్ణ గౌడ్, సురేష్ బాబు,సాహెబ్,వెంకటరమణ,సత్యనారాయణ,విజయ్‌కుమార్,బలరాంపాల్గొన్నారు.

జగన్‌పాలనలో మైనార్టీలకు న్యాయం

- వైఎస్ఆర్‌సీపీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్
- 4వ వార్డులో పార్టీ కార్యాలయం ప్రారంభం





వైఎస్ఆర్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఇంతియాజ్, 4వ వార్డులో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్, మాజీ ఎమ్మెలే ఎస్వీ

కర్నూలు (టౌన్): సీఎం వైఎస్ జగన్ పాలనలో మైనార్టీ లకు అన్ని విధాలుగా న్యాయం జరుగుతుందని వైఎస్ఆర్‌సీపీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ అన్నారు. సోమవారం రాత్రి స్థానిక పాతబస్తీలోని 4వ వార్డు కాలేకరీం మసీద్ వద్ద మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డితో కలిసి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ మద్దతుగా నిలవాలన్నారు.ఆయన పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఎన్నికల్లో మైనార్టీలంతా ఏకమై తనను గెలిపించాలని అభ్యర్థించారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలు జగనన్నకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని, అదే సంప్రదాయాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ మాబుసా, వార్డు ఇన్‌చార్జ్ రియాజ్ బాబా, కార్పొరేటర్లు అర్షియా ఫర్హీన్, పింజరి షాషావలి, పుల్లమ్మ, షేక్ యూనుస్ బాషా, అన్నెపోగు క్రాంతికుమార్, పార్టీ నాయకులు హకీం పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌సీపీలో చేరిక

ప్రజా పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని వైఎస్ఆర్‌సీపీ కర్నూలు నియోజవర్గ అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు సోమవారం స్థానిక మాజీ ఎమ్మెల్యే ఎస్వీ స్వగృహంలో 23 వ వార్డు వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జ్ కటారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో శ్రీరామనగర్‌కు చెందిన 20 కుటుంబాలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. వారందరికీ ఇరువురు నాయకులు పార్టీ కండువాలు కప్పి వైఎస్ఆర్‌సీపీలోకి ఆహ్వానించారు. అనంతరం ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కర్నూలు ప్రజలు ఎప్పుడూ వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీకే పట్టం కడుతున్నారన్నారు. దివంగత వైఎస్ఆర్ ముస్లిం మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ఎంతో మంది ముస్లిం యువకులు రిజర్వేషన్‌తో ఉన్నత చదవులు అభ్యసించారన్నారు. అందుకే ముస్లిం మైనార్టీలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్, వైఎస్ రాజశేఖర్ రెడ్డి మీద ఎనలేని అభిమానం చూపుతారన్నారు. పార్టీలో చేరిన వారిలో స్థానిక శ్రీరామనగర్‌కు చెందిన ఇంతియాజ్, మహేష్, రాజు, చిన్న, సంజయ్, మనోజ్ తదితరులు ఉన్నారు.